www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -108 ఆదివారం 2 ఆగస్టు 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# అభివృద్ధికి కొత్త రన్‌వే..



## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ



- ఈ గడ్డపై అడుగుపెట్టడం ఎంతో గర్వకారణం: ప్రధాని మోదీ
- రూ.18 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అల్లూరి సీతారామరాజు పేరు ఖరారు
- గిరిజన మహిళల థింసా నృత్యం ప్రపంచ రికార్డు సాధించిందన్న ప్రధాని
- చంద్రబాబు దార్శనికతను మనస్ఫూర్తిగా అభినందించిన మోదీ



**భోగాపురం ఆగస్టు 01(ప్రజావినికిడి):**
పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. నేటి రోజు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా' ప్రదర్శన తనను మధురానుభూతికి లోనుచేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు.

మిగతా 2లో.




## ఉత్తరాంధ్రకు మణిహారం..

**ఉత్తరాంధ్రలో సరికొత్త చరిత్ర ప్రారంభమైందన్న సీఎం చంద్రబాబు**

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో 'అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం' ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు.



మిగతా 2లో.

## మోదీని విమర్శిస్తుంటే బాధపడ్డా

**: డిప్యూటీ సీఎం పవన్**

**ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ కీలకమన్న పవన్**

**దేశాన్ని మోదీ ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ప్రశంస**

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.



మిగతా 2లో.

## 'అర్థమైందా రాజా!'..

- ఎర్ర బస్సు రాదన్న చోట విమానాశ్రయం నిర్మించామన్న లోకేశ్
- ఉత్తరాంధ్ర ప్రజలను అవమానించిన వారికి గట్టి జవాబు అని వ్యాఖ్య
- ప్రధాని మోదీ సహకారంతోనే ఏపీలో అభివృద్ధి పనులు అన్న మంత్రి
- కొత్త విమానాశ్రయం ఏపీకి పవర్ ఇంజిన్‌గా మారుతుందన్న ధీమా

ఎర్ర బస్సు కూడా రాని చోటుకు ఎయిర్‌బస్ అవసరమా? అని ఎగతాళి చేసిన చోటే ఇప్పుడు విమానాశ్రయం వచ్చిందని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గతంలో కొందరు ఉత్తరాంధ్రను తక్కువగా చూసి, ఇక్కడి ప్రజలను అవమానించారని ఆయన విమర్శించారు



మిగతా 2లో.

## చట్టాన్ని గౌరవించడం ప్రాథమిక విధి

- స్వేచ్ఛ అంటే ఇష్టం వచ్చినట్లు చేయడం కాదు
- సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ముఖ్యమే
- జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్య
- దోవల్‌కు అమిత్ షా చేతుల మీదుగా తిలక్ జాతీయ పురస్కారం అందచేత




మిగతా 2లో.

**ముంబైఆగస్టు 1 (ప్రజావినికిడి):**
ఇటీవల దేశంలో యువత చేపట్టిన నిరసనలపై జాతీయ భద్రతా సలహాదారు, ఇండియన్ జేమ్స్ బాండ్ అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛ అంటే ఇష్టమొచ్చింది చేయడం కాదని యువతకు చురకలటించారు. స్వేచ్ఛతో పాటు సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ఉంటాయని యువత

## హైడ్రా పనులతో మారిన రూపు..

**నల్ల చెరువు పునరుజ్జీవంలో హైడ్రా అహర్నిశలు కృషి**

**అత్యుత్తమ పనితీరును ప్రదర్శిస్తోన్న రాష్ట్రం..సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్**





**హైదరాబాద్ ఆగస్టు 1 (ప్రజావినికిడి):**
ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి హైడ్రా అహర్నిశలు శ్రమించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారులకు, సిబ్బందికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈమేరకు శనివారం ట్వీట్ చేశారు. చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న హైదరాబాద్‌ను చూడటం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. క్యూర్ పరిధిని క్యూర్ చేసుకుంటూడ మన చెరువులకు జీవం పోస్తూడ జీవంతో నిండిన భవిష్యత్తును భావి తరాలకు

మిగతా 2లో.

## ఆర్థిక వ్యవస్థ జోరు..

- 14 నెలల రికార్డు స్థాయికి జీఎస్‌టీ వసూళ్లు
- జులైలో జీఎస్‌టీ వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లు
- వార్షిక ప్రాతిపదికన 15.4 శాతం వృద్ధి
- 14 నెలల్లో అత్యధిక వృద్ధి నమోదు
- దిగుమతుల జీఎస్‌టీ ఆదాయం 28.8 శాతం పెరుగుదల
- నికర జీఎస్‌టీ ఆదాయం రూ.1.81 లక్షల కోట్లు
- తొలి నాలుగు నెలల వసూళ్లు రూ.8.43 లక్షల కోట్లు

2లో.




## భారత మహిళా బాక్సర్ల పంచ్ పవర్...

- ఒకే రోజు 5 పసిడి పతకాలు
- కామన్వెల్త్ గేమ్స్ బాక్సింగ్‌లో భారత్‌కు స్వర్ణాల పంట
- మహిళల బాక్సింగ్‌లో ఒకేరోజు ఐదు బంగారు పతకాలు
- సాక్షి, జాస్మిన్, ప్రీతి, ప్రియ, అరుంధతి స్వర్ణాలు కైవసం
- ప్రత్యర్థులపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత బాక్సర్లు

**ఢిల్లీ ఆగస్టు 1(ప్రజావినికిడి):**
కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత మహిళా బాక్సర్లు సంచలనం సృష్టించారు. యూకేలోని గ్లాస్గో వేదికగా శనివారం జరిగిన బాక్సింగ్ ఫైనల్స్‌లో ఏకంగా ఐదు స్వర్ణ పతకాలు సాధించి చరిత్ర సృష్టించారు. సాక్షి (51 కేజీలు), జాస్మిన్ (57 కేజీలు),



మిగతా 2లో.

# అభివృద్ధికి కొత్త రన్‌వే..



**మొదటిపేజీ తరువాయి**

ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ హృదయపూర్వకంగా అభినందించారు.

భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త 'రన్‌వే'గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక 'లాంచ్‌ప్యాడ్' అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. "అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం" అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## మోదీని విమర్శిస్తుంటే బాధపడ్డా

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి రాష్ట్రంగా మారబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు.

ప్రధాని మోదీ 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ దేశాన్ని 'వికసిత్ భారత్' దిశగా వేగంగా నడిపిస్తున్నారని పవన్ కొనియాడారు. ఆయన నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎదుర్కొన్న విమర్శలను పవన్ గుర్తుచేసుకున్నారు. గతంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రధానిని కొందరు విమర్శిస్తున్నప్పుడు తాను చాలా బాధపడ్డానని తెలిపారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, వెనక్కి లాగే ప్రయత్నాలు జరిగినా మోదీ ఎక్కడా భయపడలేదని ప్రశంసించారు. మోదీ లాంటి ప్రధాని దేశానికి లభించడం అందరి అదృష్టమని, తనను దూషించిన వారిని కూడా క్షమించే గొప్ప గుణం ఆయనదని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు.

## 'అర్థమైందా రాజా!'..

"ఎర్ర బస్సు రాదన్నచోట ఎయిర్‌పోర్టు వచ్చింది, మన ప్రధాని మోదీ వచ్చారు. ఇదే మన ఉత్తరాంధ్ర దెబ్బ, అర్థమైందా రాజా!" అంటూ ప్రత్యర్థులను ఉద్దేశించి పదునైన వ్యాఖ్యలు చేశారు.

ఉత్తరాంధ్ర కలలకు ప్రధాని నరేంద్ర మోదీ రెక్కలు తొడిగారని లోకేశ్ కొనియాడారు. ప్రధాని సహకారంతోనే ఆంధ్రప్రదేశ్‌లో అనేక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ఆయన పూర్తి మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. నమో అంటే.. హిమ్మత్ (ధైర్యం), విశ్వాస్ (నమ్మకం), సురక్షిత్ భారత్ (సురక్షిత భారతం) అని ఆయన వివరించారు.

సహజ వనరులు సమృద్ధిగా ఉన్న ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ విమానాశ్రయం కీలకం కానుందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ఈ ఎయిర్‌పోర్టు రాష్ట్రానికి ఒక పవర్ ఇంజిన్‌గా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. విమానాశ్రయాన్ని వేగంగా నిర్మించిన జీఎంఆర్ సంస్థను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కానీ నేడు ఇక్కడకు ఎయిర్‌బస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి అడ్డుపడిన శక్తులను ప్రజలు తిరస్కరించారని అన్నారు.

## ఉత్తరాంధ్రకు మణిహారం..

ఈ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు ప్రశంసించారు. "రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చాం. ఆ హామీని నిలబెట్టుకున్నాం" అని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడం, దీనికి తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ప్రాంతం వారే కావడం విశేషమని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల పూర్తిపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి రాజధాని అమరావతి తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను కాపాడింది, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని కొనియాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో తెలంగాణ దశ మారినట్లే, భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రానున్న రెండేళ్లలో ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొస్తామని, తద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.2784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి సైతం అనుమతులు వచ్చాయని తెలిపారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించి, టూరిజం, ఫార్మా రంగాలను అభివృద్ధి చేసి ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మారుస్తామన్నారు. త్వరలోనే ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే రోజులు వస్తాయని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.



# భారత మహిళా బాక్సర్ల పంచ్ పవర్...

**మొదటిపేజీ తరువాయి**

ప్రీతి (54 కేజీలు), ప్రియ (60 కేజీలు), అరుంధతి చౌదరి (70 కేజీలు) తమ ఫైనల్ బౌట్లలో అద్భుతమైన ప్రదర్శనతో పసిడి పతకాలను ముద్దాడారు. ఈ విజయాలతో అంతర్జాతీయ బాక్సింగ్‌లో భారత్ తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న విషయాన్ని మరోసారి చాటిచెప్పారు.

శనివారం జరిగిన ఫైనల్స్‌లో భారత బాక్సర్ల జోరు ముందు ప్రత్యర్థులు నిలవలేకపోయారు. 51 కేజీల విభాగంలో సాక్షి చౌదరి, ఇంగ్లండ్‌కు చెందిన రూబీ వైట్‌పై 5-0 ఏకగ్రీవ నిర్ణయంతో ఘనవిజయం సాధించింది. బౌట్ ఆద్యంతం పదునైన ఫుట్‌వర్క్‌తో, కచ్చితమైన పంచ్‌లతో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. అదేవిధంగా, 57 కేజీల విభాగంలో జాస్మిన్.. నార్తర్న్ ఐర్లాండ్ బాక్సర్ మైఖేలా వాల్ష్‌పై 5-0తో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 54 కేజీల విభాగంలో ప్రీతి, కెనడా బాక్సర్ ఎస్.ఎస్. డెల్గాడోపై 5-0 తేడాతో గెలవడమే కాకుండా, బౌట్ మధ్యలో ప్రత్యర్థిని నాక్‌డౌన్ చేసి తన సత్తా చాటింది. ఇక 70 కేజీల విభాగంలో అరుంధతి చౌదరి కూడా ఇంగ్లండ్ బాక్సర్ చాంటెల్ రీడ్‌పై 5-0తో సునాయాసంగా గెలిచింది.వీరితో పాటు 60 కేజీల విభాగంలో ప్రియ ఘూంఘూస్, కెనడాకు చెందిన మేరీ-బతౌల్ అల్-అహ్మదియాతో హోరాహోరీగా తలపడింది. చివరి వరకు ఉత్కంఠగా సాగిన ఈ పోరులో 4-1 స్ప్లిట్ డిసిషన్‌తో ప్రియ విజేతగా నిలిచింది. తొలి రౌండ్‌లో కాస్త వెనుకబడినప్పటికీ, ఆ తర్వాత పుంజుకుని పదునైన పంచ్‌లతో న్యాయనిర్ణేతలను మెప్పించింది.ఈ అద్భుత విజయాలతో అంతర్జాతీయ వేదికలపై మహిళల బాక్సింగ్‌లో భారత్ తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఒకే ఈవెంట్‌లో ఐదుగురు మహిళా బాక్సర్లు స్వర్ణాలు గెలవడం భారత క్రీడా చరిత్రలోనే ఒక అరుదైన ఘనత. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో భారత పతకాల సంఖ్యను పెంచడంలో బాక్సింగ్ బృందం కీలక పాత్ర పోషించింది. మొత్తం టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రతిభ, వ్యూహాత్మక నైపుణ్యం ప్రదర్శించిన భారత మహిళా బాక్సర్లు, దేశానికి గర్వకారణంగా నిలిచారు.

# హైడ్రా పనులతో మారిన రూపు..

**మొదటిపేజీ తరువాయి**

హైడ్రా అంకితం చేస్తోందని తెలిపారు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదనీ, భావి తరాల భవిష్యత్తును భద్రపరచడం కూడా అని పేర్కొన్నారు. ప్రతి చెరువును కాపాడుతూ ప్రజల ఆస్తిని సంరక్షిస్తూ ముందుకు సాగుతామని ఆయన భరోసా ఇచ్చారు. కొత్త శిఖరాలను అధిరోహిస్తున్న తెలంగాణరాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ కొత్త శిఖరాలను అధిరోహిస్తూ సరికొత్త విజయాలను సాధిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ పని తీరును ప్రదర్శిస్తోందని ట్వీట్ ద్వారా తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో తలసరి ఆదాయం రూ. 4,18,931గా నమోదయ్యిందనీ, ఇది గతేడాది రూ. 3,80,031గా ఉందని గుర్తు చేశారు. ఒకే సంవత్సరంలో తాము 10.23 శాతం వృద్ధిని సాధించామనీ, ఇది రూ. 38,900 పెరుగుదల అని తెలిపారు. కఠోర శ్రమ, ఆర్థిక వృద్ధిపై దృష్టి, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, అన్ని రంగాలలో సమతుల్య అభివృద్ధి, తాత్కాలిక విధానాల నుంచి విధాన ఆధారిత పాలనకు మారడం, శ్రద్ధతో కూడిన పని, నిరంతర సమీక్షలు, వివరాలపై శ్రద్ధ, భాగస్వాములతో నిరంతరం సంప్రదింపులు చేయడం ద్వారా ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంఢ గత దశాబ్దకాలపు వైఫల్య పాలనను, నిరాశావాద వాతావరణాన్ని తిప్పికొట్టి, ప్రతి పౌరునిలో ఆశావాదాన్ని, నమ్మకాన్ని నింపిందని వివరించారు. తమ విజయానికి మహిళలు, రైతులు, యువత అతిపెద్ద లబ్దిదారులని తెలిపారు. రాబోయే కాలంలో రాష్ట్రం మరింత గొప్ప విజయాలను సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# చట్టాన్ని గౌరవించడం ప్రాథమిక విధి

**మొదటిపేజీ తరువాయి**

గుర్తుంచుకోవాలని హితవు పలికారు. స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు చట్టబద్ధమైన పరిధిలోనే ఉండాలని నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్యంలో శాంతిభద్రతలను కాపాడటం, చట్టాన్ని గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి అని గుర్తు చేశారు. స్వేచ్ఛను ఇష్టానుసారంగా ఏమైనా చేసే అనియంత్రిత హక్కుగా భావించవద్దని యువతను హెచ్చరించారు. దేశ భద్రత, ఇంటెలిజెన్స్ రంగాలలో చేసిన అసమాన సేవలకు గాను అజిత్ దోవల్ ప్రతిష్ఠాత్మక లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం మహారాష్ట్రలోని పుణెలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా దోవల్ ఈ అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు లోకమాన్య బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా లోకమాన్య తిలక్ స్మారక ట్రస్ట్ ఈ పురస్కారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఉద్యమకారులు చేసిన త్యాగాలను యువ భారతీయులు స్మరించుకోవాలని సూచించారు. భారతదేశ జాతీయ చైతన్యాన్ని తీర్చిదిద్దడంలో తిలక్ పోషించిన పాత్ర.. ఆయన జీవితం నుంచి యువతరం స్ఫూర్తి పొందాలని కోరారు. నీట్ యూజీ 2026 క్వశ్చన్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత పెద్ద ఎత్తున నిరసనలు తెలిపిన విషయం తెలిసిందే. నీట్ పేపర్ లీకేజ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చలో పార్లమెంట్?కు పిలుపునిచ్చింది. అయితే, ఈ చలో పార్లమెంట్ కార్యక్రమం తీవ్ర హింసాత్మకంగా మారింది. యువత నిరసనలను అణిచివేసేందుకు పోలీసులు దమనకాండ కొనసాగించారు. యువతపై లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్, పెల్లెట్ గన్స్ ఉపయోగించారు. కొన్ని చోట్ల పోలీసుల బలప్రయోగంపై యువత తిరగబడ్డారు. దీంతో సీజేపీ తలపెట్టిన చలో పార్లమెంట్ తీవ్ర హింసాత్మకంగా మారింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిపక్షాలు కూడా విద్యార్థుల దాడిని తీవ్రంగా ఖండించాయి. యువత, ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి పెరగడంతో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మరో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తాత్కాలికంగా విద్యాశాఖ బాధ్యతలు చేపట్టారు.

------

# ఆర్థిక వ్యవస్థ జోరు..

## 14 నెలల రికార్డు స్థాయికి జీఎస్టీ వసూళ్లు

**ఢిల్లీ ఆగస్టు 1(ప్రజావినికిడి):** దేశంలో ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు జులైలో భారీగా పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే 15.4 శాతం వృద్ధితో రూ.2.11 లక్షల కోట్లకు చేరాయి. గత 14 నెల్లలో నమోదైన అత్యధిక వార్షిక వృద్ధి ఇదేనని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో నెలవారీ జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మార్కు దాటడం ఇది రెండోసారి. దేశీయ వినియోగం పెరగడం, వ్యాపార కార్యకలాపాలు పుంజుకోవడమే ఈ వృద్ధికి ప్రధాన కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. గత ఏడాది జులైలో రూ.1.83 లక్షల కోట్లుగా ఉన్న స్థూల జీఎస్టీ వసూళ్లు, ఈసారి రూ.2.11 లక్షల కోట్లకు చేరాయి. దేశీయ జీఎస్టీ ఆదాయం కూడా 10.1 శాతం పెరిగింది. గత ఏడాది జులైలో రూ.1.31 లక్షల కోట్లుగా ఉన్న ఈ వసూళ్లు, ఈసారి రూ.1.45 లక్షల కోట్లకు పెరిగాయి. దిగుమతులపై జీఎస్టీ వసూళ్లు మరింత వేగంగా పెరిగాయి. 28.8 శాతం వృద్ధితో రూ.66,511 కోట్లకు చేరాయి. దీంతో మొత్తం స్థూల జీఎస్టీ వసూళ్లలో దిగుమతుల వాటా గణనీయంగా పెరిగింది. జులైలో జీఎస్టీ రీఫండ్‌లు కూడా 13.1 శాతం పెరిగి రూ.29,968 కోట్లుగా నమోదయ్యాయి. రీఫండ్‌లను మినహాయించిన తర్వాత నికర జీఎస్టీ ఆదాయం రూ.1.81 లక్షల కోట్లుగా నిలిచింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 15.8 శాతం ఎక్కువ. ఇందులో దేశీయ నికర ఆదాయం 10.5 శాతం పెరిగి రూ.1.27 లక్షల కోట్లకు చేరగా, కస్టమ్స్ జీఎస్టీ నుంచి వచ్చిన నికర ఆదాయం 30.3 శాతం పెరిగి రూ.54,223 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో మొత్తం జీఎస్టీ వసూళ్లు రూ.8.43 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో ఇవి రూ.7.66 లక్షల కోట్లుగా ఉన్నాయి. అంటే 10.1 శాతం వృద్ధి నమోదైంది. ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక ప్రకారం, జీఎస్టీతో పాటు ప్రాథమిక ఎక్సైజ్ సుంకంలో రాష్ట్రాల వాటాను పరిగణనలోకి తీసుకుంటే, 2026–27లో రాష్ట్రాలకు గత ఏడాదితో పోలిస్తే సుమారు రూ.1.43 లక్షల కోట్ల అదనపు ప్రయోజనం లభించే అవకాశం ఉంది.

# పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం

**ధరణి అక్రమాలపై ఉక్కుపాదం**

**అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ**

**నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదు**

**భూముల ధరల సవరణతో ఆదాయం 20శాతం వరకు పెరుగుదల**

**త్వరలో అసైన్డ్ భూములపై సమగ్ర విధాన నిర్ణయం**

**కేంద్రం నిధులు ఇవ్వకపోయినా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లిస్తాం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్,ఆగస్టు 1 (ప్రజావినికిడి):** ధరణి అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ధరణి నుంచి భూభారతి వరకు లావాదేవీలపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. పేదల భూములను కాజేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదన్నారు. మరోవైపు భూముల ధరల సవరణతో రిజిస్ట్రేషన్ల ఆదాయం 20శాతం వరకు పెరిగిందని పొంగులేటి తెలిపారు. సచివాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములను, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు. ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేల్చుతామన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఆ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు



చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితాను కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తైందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. క్యూర్ పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌ను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీకు _ కారుతున్నాయని మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ÷నెల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ.13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ.15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
ఆదివారం 2 ఆగస్టు 2026

## ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, మహిళలు మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు.అదేవిధంగా పలు ప్రాంతాల్లో పలు శుభ కార్యక్రమాల్లో పాల్గొనాలని పలువురు ఆహ్వానించారు .

## గాగిల్లాపూర్ తాండ-2 లో ఘనంగా శ్రీఎల్లమ్మ తల్లి బోనాల పండుగ

### పాల్గొన్న: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి..

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ పరిధిలోని గాగిలాపూర్ తాండ2 లో శనివారం ఘనంగా నిర్వహించిన శ్రీశ్రీ శ్రీ ఎల్లమ్మ తల్లి బోనాల మహోత్సవాలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల



పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. అమ్మవారి కృపతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు,ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. గ్రామ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, సిద్ధునోళ్ల సంజీవ్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోట్ల విజయ్ కుమార్, కె.భిక్షపతి నాయక్,ఎల్.శ్రీను నాయక్,డి. రాజు నాయక్, డి.నెహ్రూ నాయక్,కె. హనుమంతు నాయక్,ఎల్. ప్రేమ్ సింగ్ నాయక్,టి.శ్రీను నాయక్,కె. ప్రవీణ్ నాయక్,కె. కన్నా నాయక్, ఆర్.కుమార్ నాయక్,కె. స్వామి నాయక్, డి.గణేష్ నాయక్,జె. నరేందర్ నాయక్,కె. మదన్ నాయక్, డి.విజయ్ నాయక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిరుపేద వీధి వ్యాపారుల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం..



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** ఎన్నో ఏళ్లుగా రోడ్డు పక్కన చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న నిరుపేద వీధి వ్యాపారుల జీవనాధారాన్ని ప్రభుత్వం దెబ్బతీస్తోంది. ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా చిన్న వ్యాపార సముదాయాలను కూల్చివేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.శనివారం ఉదయం టిఎస్ఐఐసి కాలనీ నుండి రాజీవ్ గాంధీ నగర్ వరకు ఉన్న వీధి వ్యాపార సముదాయాలను సిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేస్తుండగా,వెంటనే సిఎంసి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ సంఘటన స్థలానికి చేరుకుని అధికారులను నిలదీశారు.అనంతరం ఈ విషయాన్ని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి తీసుకెళ్లి, స్థానికంగా బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కనీసం రెండు వారాల పాటు కూల్చివేతలను నిలిపివేసి,వీధి వ్యాపారులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడి, తాత్కాలికంగా కూల్చివేతలను నిలిపివేయించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్,డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్,రుద్ర అశోక్, ఇస్మాయిల్,జై కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు కల్పించడం లక్ష్యం

### :బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ వివేకానంద్..




**కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):** 278–గాజుల రామారం డివిజన్ పెద్దమ్మ నగర్ బస్తీ (1.12 కోట్ల రూపాయలు), అయ్యప్ప కాలనీ (90 లక్షల రూపాయలు) లలో సీసీ రోడ్ల నిర్మాణానికై నిధులు మంజూరైన సందర్భంగా ఆయా బస్తీలు, కాలనీలో బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధికారులతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా బస్తీలో పర్యటించిన ఎమ్మెల్యే కి కాలనీ వాసులు గజమాల, డప్పుల దరువుల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ,పెద్దమ్మ బస్తీలో ఇప్పటికే భూగర్భ డ్రైనేజీ, త్రాగునీటి పైప్ లైన్,వీధి దీపాల వంటి మౌళిక వసతుల సదుపాయాలతో అభివృద్ధి పరిచామని,అతి త్వరలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కూడా ప్రారంభించి పెద్దమ్మ నగర్ ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఏఈ కళ్యాణ్, జలమండలి డీజీఎం రవి నాయక్,మేనేజర్ రమ్య భారతి, పెద్దమ్మ నగర్ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ డి.నవీన్, జనరల్ సెక్రటరీ రమేష్,వైస్ ప్రెసిడెంట్ మనోహర్, కోశాధికారి ఆరిఫ్, పరశురాం, జాయింట్ సెక్రటరీ జీ.శ్రీనివాస్,సంక్షేమ సంఘం సభ్యులు గోపాల్ అలాగే స్థానిక నాయకులు పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్,డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్,అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, నాయకులు, మహిళా నాయకురాల్లు రాధా భాయి తదితరులు పాల్గొన్నారు.

## సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం సర్కిల్, మహదేవపురం డివిజన్‌లో రూ.2 కోట్ల 41లక్షల 50 వేల రూపాయల వ్యయంతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది.స్థానిక కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పనులకు శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహదేవపురం డివిజన్‌లోని షిరిడి హిల్స్‌కు రూ.60 లక్షలు, సాయిగ్రామ్ కు రూ.22 లక్షలు, బాలయ్య నగర్‌కు రూ.47.50 లక్షలు, కమలమ్మ కాలనీకి రూ.20 లక్షలు అలాగే రావి నారాయణరెడ్డి నగర్‌కు రూ.92 లక్షలతో మొత్తం రూ.2 కోట్ల41 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టడం శుభపరిణామమని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు కృషి ఫలితంగానే ఈ భారీ నిధులు మంజూరయ్యాయని ఆయన పేర్కొన్నారు.రోడ్ల సౌకర్యం లేక కాలనీవాసులు ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ముఖ్యంగా వర్షాకాలంలో వరద నీరు కాలనీల్లో నిలిచిపోవడంతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు.ఈ రోడ్ల నిర్మాణంతో స్థానిక ప్రజల ఇబ్బందులు గణనీయంగా తగ్గనున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మరో 50 కోట్ల నిధులకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అతి తొందరలో శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.
అలాగే గత బీఆర్ఎస్ (టీఆర్ఎస్) ప్రభుత్వ హయాంలో మహదేవపురం డివిజన్‌కు ఇంత పెద్ద మొత్తంలో అభివృద్ధి నిధులు కేటాయించలేదనిస్థానిక సమస్యలను పరిష్కరించడంలో అప్పటి ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు.
అదేవిధంగా సర్ కార్యక్రమాన్ని ఆగస్టు 10వ తారీఖు వరకు పొడిగించిన నేపథ్యంలో తమ వివరాలను సమర్పించని వారు బిఎల్ఓ లకు అందజేయాలని స్థానికులను సూచించారు.
రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో కృషి చేసిన మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ కి కు వివిధ కాలనీలకు చెందిన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ తో పాటు టిపిసిసి మాజీ కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సిహెచ్ బుచ్చిరెడ్డి, దుగ్యాల ప్రసాద్, షిరిడి హిల్స్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్,సత్య, సాయి గ్రామ్ కాలనీ కార్యదర్శులు చంద్రశేఖర్,బాలయ్య నగర్ గంగారాం, కమలమ్మ కాలనీ అధ్యక్ష కార్యదర్శులు రమణ రెడ్డి, ప్రసాద్, రావినారాయణ రెడ్డి నగర్ వాసులు వీరయ్య,అంజి ముదిరాజ్,యం. సాగర్ , యాదవరావు, దంపనబోయిన, యశ్వంత్ రెడ్డి, శ్రీనివాస్,వివిధ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ మహేశ్వరి సమాజ్ మహిళా మండల్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్





**కొత్తపేట,(ప్రజావినికిడి):**
శ్రీ మహేశ్వరి సమాజ్ మహిళా మండల్ దిల్సుక్నగర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఎగ్జిబిషన్ ఆగస్టు 1వ తేదీ 2వ తేదీ న కొత్తపేట లోని న్యూ మారుతి నగర్ శ్వేత గార్డెన్ లో నిర్వహించిన ఎగ్జిబిషన్ ను ఉదయం 9 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు జరగనున్నది.ఈ ఎగ్జిబిషన్ లో ప్రత్యేకమైన ఆకర్షణలతో సరికొత్త డిజైన్లతో దుస్తులు వెస్టిన్ వేర్ రాఖీలు గిఫ్ట్ ఐటమ్స్ ఇంటికి సంబంధించిన ప్రతి ఒక్క వస్తువులు వెండి



ఆభరణాలు ఇమిటేషన్ జ్యువలరీ రుచికరమైన ఫుడ్ స్టాల్స్ మహిళలకు సంబంధించిన నూతన డిజైన్లతో కూడుకున్నటువంటి వస్త్ర భరణాలు ఇక్కడ లభిస్తాయని స్టాల్ నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా ప్రత్యేకంగా ఫ్రీ మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.అలాగే తంబోలా లక్కీ డ్రా రీల్ మేకింగ్ వంటి అనేక ఆకర్షణ నిజమైన కాంపిటీషన్స్ ఉన్నాయి..ఈ ఎగ్జిబిషన్ లో పెద్ద ఎత్తున షాపింగ్ చేసిన వారికి వెజ్ జువెలర్స్ వారి ద్వారా ఆకర్షణీయమైన వెండి బహుమానం ఇవ్వనున్నట్టు తెలిపారు.ఈ ఎగ్జిబిషన్ ని సందర్శించాలంటే ఉచిత ప్రవేశం కలదని స్టాల్ నిర్వాహకులు తెలియజేశారు.

## మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి

### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

**హిమాయత్ నగర్,(ప్రజా వినికిడి):**
మణుగూరులోని పికెఒసి–2 డీప్‌సైడ్ బొగ్గు బ్లాక్‌ను జెన్‌కోకు కాకుండా సింగరేణికే కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)
అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్‌ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బొగ్గు వెలికితీత కనీస పరిజ్ఞానం గాని యంత్రాలు కూడ లేని జన్‌కో ఈ వేలంలో పాల్గొన్నడమే సింగరేణికి అన్యాయం చేయడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 3న జరగనున్న బొగ్గు బ్లాక్ వేలంలో జెన్‌కో పోటీ నుంచి తప్పుకుని, డీప్‌సైడ్ బ్లాక్‌ను నేరుగా సింగరేణికే కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని దేశోద్దర్ధక్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఎఐటియూసి రాష్ట్ర కార్యదర్శి



బి.వెంకశం, యూనియన్ వేణుమాధవ్‌తో కలిసి వారు మాట్లాడారు.ఈ సందర్భంగా వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్ కుమార్‌లు మాట్లాడుతూ గతంలోను తాడిచర్ల–1 గనిని జెన్‌కోకు కేటాయించినప్పటికీ, గనుల నిర్వహణ సామర్థ్యం లేక ఎఎంఆర్ అనే ప్రైవేట్ సంస్థ ద్వారా బొగ్గు తవ్విస్తున్నారని, ఇందుకు టన్నుకు రూ.3800లు జన్‌కో చెల్లిస్తుండగా అదే సింగరేణి రూ.3400లకే సరఫరా చేస్తోందన్నారు. ఇదేక్రమంలో, ప్రైవేట్ కాంట్రాక్టర్లకే లాభం చేకూర్చుడం ద్వారా వందల కోట్లను దోచుకునేందుకే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. బొగ్గు వెలికితీతలో ఎంతో పరిజ్ఞానం ఉన్న పలు ప్రైవేట్ సంస్థలు మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్ టెండర్లలో ఈసారి ఆసక్తి చూపలేదని, అయినప్పటికీ ఏమాత్రం పరిజ్ఞానం గాని యంత్రాగం గాని లేని జెన్‌కో టెండర్‌లో పాల్గొనడం వెనుక ఇందన శాఖలోని కొంతమంది అధికారులు హస్తం ఉందని ఆరోపించారు. తద్వారా ప్రైవేట్ సంస్థలకు లాభం చేకూర్చుడం ద్వారా వందల కోట్లు దండుకునేందుకే ఇదంతా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిలో ప్రస్తుతం 40 వేల మంది శాశ్వత ఉద్యోగులు,30 వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని, మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి రాకపోతే 2032 తర్వాత మణుగూరు ప్రాంతంలో సింగరేణి కార్యకలాపాలు నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. దీంతో 3,500 మంది శాశ్వత ఉద్యోగులు, 2,000 మంది కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. సింగరేణిని నిర్వీర్యం చేయాలనే కుట్రలు పన్నితే గతంలో బిఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని సింగరేణి కాలరీస్ యూనియన్ నాయకులు హెచ్చరించారు.

## తెలంగాణ ప్రభుత్వం బోనాల సందర్భంగా 80 దేవాలయాలకు రూ.27 లక్షల విడుదల..

### మంజూరైన చెక్కులను వివిధ దేవాలయాలకు అందజేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..

**రాజేంద్రనగర్, (ప్రజావినికిడి):**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బోనాల పండుగను పురస్కరించుకుని, రాజేంద్రనగర్ నియోజకవర్గం జిహెచ్ఎంసి పరిధిలోని అమ్మవారి దేవాలయాల అలంకరణ మరియు ఉత్సవాల నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది.ఇందులో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం,
శివరాంపల్లిలోని రాందేవ్ బాబా ఆలయ ప్రాంగణంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్



గౌడ్,ప్రభుత్వ సలహాదారు శ్రీ హర్క వేణుగోపాల్ తో కలిసి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ,
ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఆయా ఆలయాల కమిటీలు అమ్మవారి ఆలయాలను సుందరంగా అలంకరించి,భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని కోరారు. అనంతరం 80 దేవాలయాల కమిటీ సభ్యులకు రూ. 27 లక్షల విలువైన గ్రాంట్ చెక్కులను వారు స్వయంగా అందజేశారు.

# అవతలి ఓడ్డు, అందని ద్రాక్షేనా

## మూడు రోజుల ముచ్చటగా తాత్కాలిక రోడ్డు.. -జాతీయ రహదారికి లేదా..దారి..?


ఇసుక వాగు వంతెనను ముంచిన వరద నీరు



**వాజేడు,ఆగష్టు 2,(ప్రజావినికిడి)**
మండలంలో చీకుపల్లి, పెద్దగొల్లగూడెం, మధ్యలో ఉన్న ఇసుక వాగు బ్రిడ్జి పనులు మార్చి మొదటి వారంలో మొదలైన నేటికీ నత్త నడకన నడుస్తున్నాయి ఈ బ్రిడ్జి పనుల కోసం పాత బ్రిడ్జి కూలగొట్టి తాత్కాలిక రోడ్డు నిర్మించారు అప్పటినుండి జులై 20వ,తేది వరకు రోడ్డు రవాణా జరిగింది 21వ తేదీన కురిసిన భారీ వర్షాలకు తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది దీంతో మూడు రోజులు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిసిపోయాయి మళ్లీ 23వ తేదీన తాత్కాలిక రోడ్డు పునరుద్ధరించారు 29వ తేదీ కురిసిన భారీ వర్షాలకు రాత్రి తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయింది దీంతో రవాణ స్తంబించింది దీనికి తోడు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్గఢ్, రాష్ట్రాల్లో కురిచిన భారీ వర్షాలకు గోదావరి ఉప్పొంగింది, ఇసుక వాగుతో పాటు చుట్టప్రక్కల గ్రామాలు ముంపునకు గురయ్యాయి ఈ గోదావరి ముంపు ఎంత కాలం ఉంటుందో ఎవరికి తెలియదు అప్పటి వరకు పడవ ప్రయాణం తప్పదా అన్నట్లు 25,గ్రామాల ప్రజలతో పాటు 163,వ జాతీయ రహదారి ప్రయాణికులతో పాటు భారీ వాహనాలు ఎదురు చూస్తున్నాయి అప్పటి నుండి ఇప్పటి వరకు అవతలి ఓడ్డు, అందని ద్రాక్ష లాగా మిగిలి పోతుంది ఎంతో మంది ప్రయాణికులు, ఎన్నో రాష్ట్రల వాహనాలు, వైద్యం కోసం వెళ్ళేవాళ్ళు గర్భిణి స్త్రీలు అందరు కోరుకునేది ఇసుక వాగు బ్రిడ్జి పనులు పూర్తి అయ్యే వరకు మరో డైవర్సన్ రోడ్డు చూపించండి మండల ప్రజలతో పాటు పక్క రాష్ట్రాల వాళ్ళు కోరుచున్నారు అదే..చెరుకూరు నుండి శ్రీరామ్ నగర్, కోయవీరాపురం, మీదుగా బొగత వాటర్ పాల్స్, చీకుపల్లి వరకు ఉన్న రోడ్డు మార్గం పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# వాజేడు మండలంలో మంత్రి సీతక్క పర్యటన

### గోదావరి వరద తగ్గాలని ప్రత్యేక పూజలు..

### చీకుపల్లి-పెద్దగొల్లగూడెం దెబ్బతిన్న తాత్కాలిక రోడ్డు పరిశీలిన..





**వాజేడు,ఆగష్టు 2,(ప్రజావినికిడి):**వాజేడు మండలంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాబివృద్ధి, నీటి పారుదల శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి.అనసూయా(సీతక్క) పర్యటించారు. ముందుగా ముళ్ళకట్ట, పూసూరు వంతెన వద్ద మంత్రి సీతక్క ,జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వస్సల్ టోప్పో లతో కలిసి పరిశీలించి గోదావరి వరద శాంతించాలని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం చీకుపల్లి,పెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య ఇసుకవాగు వంతెన వద్ద భారీ వర్షాలకు దెబ్బతిన్న తాత్కాలిక రోడ్డును పరిశీలించి, పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి నది వరద ప్రవాహంపై అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని,బ్యాక్ వాటర్ ద్వారా గ్రామాలు కాలనీలు ముంపుకు గురైతే వెంటనే ఆ కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పి మనన్ భట్,గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి,ఆర్డీఓ కృష్ణవేణి, తహసిల్దార్,శ్రీనివాస్,ఎంపిడిఓ,కృపాకర్,స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# హనుమాన్ గుడిలో హుండీ మాయం

**వాజేడు,ఆగస్టు 2,(ప్రజావినికిడి):**
మండల కేంద్రంలో చిన్నగొల్లగూడెం గ్రామంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హనుమాన్ గుడిలో హుండీని దొంగలించారు.శనివారం ఉదయం గుడిని శుద్ధి చేయడానికి వచ్చిన హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు ఎర్రావుల యశ్వంత్ హుండీ కనిపించకపోవడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు.హుండీలో సుమారు 5వేల రూపాయలు ఉంటుందని అన్నారు.



## శనివారం నుండి బొగత పర్యటనకు అనుమతి

**వాజేడు,ఆగస్టు 2,(ప్రజావినికిడి):**ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాతంలో ఉన్న నయాగర,బొగత జలపాతం, (వాటర్ పాల్స్) శనివారం నుండి అటవీ శాఖ అధికారులు బొగత పర్యటనకు అనుమతి ఇచ్చారు దీంతో పర్యటకుల సందడి మొదలైంది ఇదే రోజు మంత్రి సీతక్క కూడా బొగత జలపాతం వద్ద సందడి చేసారు. పర్యటకుల సౌకర్యాలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.




# కోఠీలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి రూ. 2లక్షల 50 వేలు విరాళం



**హిమాయత్ నగర్,(ప్రజా వినికిడి):**
కోఠీలోని ఇసామియా బజార్ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి మురికి చంద్రమౌళి అనే భక్తుడు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ పూజారికి రూ 2 లక్షల 50 వేలు విరాళం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్వామి వారి వసతి గృహం కోసం 100 గజాల స్థలం కావాలంటూ గతంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రకటించడంతో ఈ మేరకు తాను సహాయం చేశానని పేర్కొన్నారు. ఆలయ పూజారి వారి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులు మురికి చంద్రమౌళి వారి సతీమణి బాలలక్ష్మీ, కుమారులు సంతోష్ కుమార్-ప్రతిభ, సంపత్ కుమార్-పల్లవి, సతీష్ కుమార్-శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## రోబోటిక్ సాంకేతికతలో సత్తా చాటిన 'మేడ్ ఇన్ ఇండియా'



**హిమాయత్ నగర్,(ప్రజా వినికిడి):**
భారతదేశంలో అభివృద్ధి చేసిన రోబోటిక్ సాంకేతికత భారతీయ వైద్యుల నైపుణ్యం మరోసారి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఎస్ ఎస్ ఇన్నోవేషన్ ఇంటర్నేషనల్ అభివృద్ధి చేసిన 'మేడ్ ఇన్ ఇండియా' ఎస్ఎస్ఐ మంత్ర సర్జికల్ రోబోటిక్ సిస్టమ్ సహాయంతో, కొలంబియాలో సుమారు 22,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న శస్త్రచికిత్స నిపుణులు ఇండోర్‌లోని ఒక రోగికి విజయవంతంగా రోబోటిక్ స్లీవ్ గాస్ట్రెక్టమీ శస్త్రచికిత్స నిర్వహించి భారతీయ సాంకేతికతకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు.ఈ చారిత్రాత్మక టెలి-సర్జరీ కొలంబియాలోని హాస్పిటల్ ఇండోర్‌లోని మోహకే బరీ ట్రిక్స్ డ్రిక్స్ అండ్ రోబోటి మధ్య సుమారు 22,000 కి.మీ పొడవైన ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా విజయవంతంగా నిర్వహించారని పేర్కొంది..

# ఉద్యోగ,ఉపాధ్యాయుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

### బిజెపి రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

### తపస్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలోఅధ్యక్షుడు రాజశేఖర్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన భారీ మహాధర్నాలో బీజేపీ నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పాల్గొని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల న్యాయమైన డిమాండ్లకు సంఘీభావం ప్రకటించారు.
ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు,బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా.కె. లక్ష్మణ్,బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి,ఎమ్మెల్సీలు ఏ.వి.ఎన్.రెడ్డి, కొమురయ్య,అంజిరెడ్డి,బీజేపీ నాయకులు కాసం వెంకటేశ్వర్లు,తపస్ రాష్ట్ర కార్యదర్శి పెంటయ్య, సంఘటనా కార్యదర్శి హనుమంతరావు (ఏబిఆర్ఎస్ఎం) నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.వేలాది మంది ఉపాధ్యాయులు భారీగా తరలివచ్చి తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికితీసుకువచ్చారు.బిజెపి నేత నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, మాట్లాడుతూ,ఉద్యోగులు, ఉపాధ్యాయులతో విరోధం పెట్టుకున్న ఏ ప్రభుత్వమూ నిలబడలేదని అన్నారు.ఎన్నికల ముందు ఉద్యోగ,ఉపాధ్యాయ వర్గాలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖను ముఖ్యమంత్రి తన దగ్గరే ఉంచుకొని విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.ఉద్యోగులు,ఉపాధ్యాయులకు వెంటనే (పిఆర్ సీ) అమలుచేయాలని,పెండింగ్‌లో ఉన్న డిఎ లను విడుదల చేయాలని, హెల్త్ కార్డులకు నగదు రహిత ఆరోగ్య సేవలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆయన కోరారు.317 జీవో వల్ల నష్టపోయిన వారికి తీసుకువచ్చిన జీవో 190 ప్రకారం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.(సిపిఎస్)ను రద్దు చేసి (ఓపిఎస్)ను అమలు చేయాలని,రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించాలని,బదిలీలు, పదోన్నతులు,ఖాళీ పోస్టుల భర్తీ,పెండింగ్ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని పేర్కొన్నారు.ఫిన్లాండ్ విద్యావ్యవస్థను అధ్యయనం చేయడానికి విదేశాలకు వెళ్లే ముందు,కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన "జాతీయ విద్యా విధానం ఎన్ఈపి-2020"ను తెలంగాణలో అమలు చేయాలని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి సూచించారు.డా.కస్తూరి రంగరాజన్ నాయకత్వంలో రూపొందిన జాతీయ విద్యా విధానాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి అమలు చేస్తే రాష్ట్ర విద్యావ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు.
కొఠారి కమిషన్ పేర్కొన్నట్లుగా దేశ భవదేశ భవిష్యత్తు తరగతిగదుల్లోనిర్మితమవుతుంది అని గుర్తుచేస్తూ, ఆ భవిష్యత్తును నిర్మించే వారే ఉపాధ్యాయులని అన్నారు.సమాజానికి ఇంజినీర్లు, డాక్టర్లు, న్యాయవాదులు,రాజకీయనాయకులు,శాస్త్రవేత్తలు,ఉపాధ్యాయులను అందించిన ఉపాధ్యాయులు ఈరోజు రోడ్డుపైకి రావడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.గత ప్రభుత్వాలకు ఉద్యోగ,ఉపాధ్యాయ ఉద్యమాలు ఎలా ప్రభావం చూపాయో గుర్తు పెట్టుకోవాలని,అదే పరిస్థితి ప్రస్తుత ప్రభుత్వానికీ తలెత్తే ప్రమాదంఉందనిహెచ్చరించారు.ముఖ్యమంత్రి వెంటనే విద్యాశాఖ సమస్యలపై దృష్టిసారించి, ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

## పోలీస్ పోస్టులకు వయోపరిమితి పెంచాలి..:ఆర్.కృష్ణయ్య




**అంబర్ పేట్, (ప్రజావినికిడి):** విద్యానగర్ లోని ఎంపీ ఆర్ క్రిష్ణయ్య ఇంటి వద్ద కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు వయోపరిమితిని పెంచాలని నిరుద్యోగ జేఏసి నేత శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఉద్యమ నేత రాజ్యసభ ఎంపీ ఆర్.క్రిష్ణయ్య సమక్షంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఎస్సైకి 38 సంవత్సరాలు, కానిస్టేబుల్ కు 36 సంవత్సరాలు వయోపరిమితిని సడలించాలని ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అప్లికేషన్ ఫీజు భారీగా పెంచారని కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అప్లికేషన్ ఫీజు తీసుకోకుండా ప్రభుత్వం నిరుద్యోగుల పక్షాన నిలబడాలని, ఎస్సై కానిస్టేబుల్ పోస్టుల సంఖ్యను పెంచాలని,లాంగ్ జంప్ ని తగ్గించాలని,ఈ ప్రభుత్వం వచ్చాక ఉద్యోగ నోటిఫికేషన్లు లేవు కావున తక్షణమే మిగతా నోటిఫికేషన్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మెగా డీఎస్సీ 30 వేలతో,గ్రూప్ వన్ 1500, గ్రూప్ 2 3000,గ్రూప్ త్రీ 4000,గ్రూప్ ఫోర్ 10వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసి నేత శంకర్ నాయక్ మాట్లాడుతూ ఎస్సై, కానిస్టేబుల్ అప్లికేషన్ ఫీజును తగ్గించాలని, వయోపరిమితిని పెంచాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నిరుద్యోగులు నరేశ్,రాజు, బాలు,శ్రీకాంత్, గీత,రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ట్ థియేటర్ లో 'కర్మాఖ్య' మూవీ టీం సందడి



**వనస్థలిపురం, (ప్రజావినికిడి):**వనస్థలిపురంలోని ఆర్ట్ సినిమాస్ లో 'కర్మాఖ్య' మూవీ టీమ్ సందడి చేశారు. ఆర్ట్ సినిమాస్ లో శనివారం రోజు కర్మాఖ్య మూవీని ప్రదర్శించారు. ఈ క్రమంలో సినిమాలో వివిధ పాత్రలో పోషించిన నటీనటులు థియేటర్ కు రావడంతో అభిమానులు ఆశ్చర్యాన్ని గురయ్యారు. వారితో ఫోటోలు దిగేందుకు అభిమానులు ఎగబడ్డారు. నటి సమీరా,సహనటి ఐశ్వర్య, దర్శకుడు అభినయ కృష్ణ లు థియేటర్ వద్ద సందడి చేశారు. కాగా,అదిరే అభి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ మూవీలో నటి 'సమైరా' ముఖ్యపాత్రలో నటించి అందరిని ఆకట్టుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రిలీజ్ అయిన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతుంది. నటి సమైరా మాట్లాడుతూ.. మా సినిమాకు ప్రేక్షకుల నుంచి ఇంత ఆదరణ లభిస్తుందని ఊహించలేదని.. ప్రేక్షకులు సినిమా థియేటర్ కు వచ్చి మూవీ చూసి తమ అనుభూతిని పొందాలని సూచించారు. అదిరే అభి మాట్లాడుతూ, సినిమా బాగుంది అని చాలామంది ఫోన్లు చేసి చెబుతుండడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది అన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రేక్షకులు మాట్లాడుతూ, నటి సమైరా అద్భుతంగా నటించారని తొలిసారిగా సినిమాలో నటించినప్పటికీ తన పాత్రకు న్యాయం చేశారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా చూడాల్సిన సినిమా అని పేర్కొన్నారు. మూవీ టీం ప్రతినిధులు వాణి నాథ్,శ్రీహరి తదితరులు ఉన్నారు.

## కొండన్నగూడ గ్రామంలో మొక్కల పంపిణీ కార్యక్రమం



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**షాద్ నగర్ నియోజకవర్గంలో వర్షాకాలాన్ని పురస్కరించుకుని ఫారుక్ నగర్ మండలం కొండన్నగూడ గ్రామంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జానంపేట అనురాధ పాల్గొని గ్రామస్థులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనురాధ మాట్లాడుతూ, సమస్త జీవరాశికి ప్రాణవాయువును అందించే మొక్కలను నాటి, సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రతి కుటుంబం ఆరు మొక్కలు తీసుకుని వాటిని పెంచి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి. మొక్కల పెంపకం వల్ల వాతావరణ సమతుల్యత నెలకొని, సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండుతాయి.. అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానంపేట సురేష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి నాగమణి,వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్,మహిపాల్ రెడ్డి,అమరావతి,ఈజీఎస్ రాములు,మాజీ వార్డు సభ్యులు బాలమోణి లక్ష్మమ్మ,కమ్మరిసుధాకర్,పాలకుర కృష్ణయ్య,హనుమంత్ యాదవ్,జంగయ్యతో పాటు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజన గురుకులంలో విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ నియోజకవర్గంలోని కొత్తూర్ మండలం ఇన్ముల్ నర్వ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండటంతో అధ్యాపక బృందం,సర్పంచ్ లలిత గోపాల్ నాయక్,గ్రామస్థులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ కి సమస్యను వివరించారు. వారి విజ్ఞప్తికి వెంటనే స్పందించిన రవీందర్ యాదవ్ పాఠశాల ఆవరణలో సొంత ఖర్చులతో బోర్ వేయించి విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు,గ్రామ పెద్దలు మాట్లాడుతూ, విద్యార్థుల ఇబ్బందిని గుర్తించి ఆలస్యం చేయకుండా బోర్ వెల్ ఏర్పాటు చేయించిన రవీందర్ యాదవ్ సేవాభావాన్ని అభినందించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఎప్పటికప్పుడు ముందుండి సహాయ సహకారాలు అందిస్తున్న ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు పెంటనోళ్ళ యాదగిరి,సర్పంచ్ నర్సమ్మ శ్రీను,మాజీ సర్పంచులు జంగయ్య,సంతోష్ నాయక్, రమేష్,మాజీ ఎంపీటీసీ వడ్డె బాలయ్య,నాయకులు మిట్టు నాయక్,నరసింహా రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,శ్రీరాములు,సిరాజోద్దీన్,గోపి నాయక్, యాదగిరి,శ్యామ్ సుందర్ రెడ్డి, సతీష్ గుప్తా,మల్లేష్, హనుమంతు,డీలర్ కుమార్, కోట్యా నాయక్,మోహన్ నాయక్,ఈ.జంగయ్య, చెన్నయ్య,రఘు,శ్రీను,బాబు రాజు తదితరులు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## తల్లిపాలు -శిశువుకు సంపూర్ణ ఆహారం

### తల్లి పాల వారోత్సవాల్లోహెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ఫరుక్ నగర్ మండలం చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏరియా లోని సబ్ సెంటర్ షాద్ నగర్ "ఏ" అవుట్ రీచ్ ఏరియా 6వ అంగన్వాడి సెంటర్ లో జరుగుతున్న వ్యాధి నిరోధక కార్యక్రమం లో వచ్చిన తల్లులందరికీ,తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు వివరించారు. తల్లి పాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన సంపూర్ణ ఆహారము అని,పాప పుట్టిన వెంటనే మొదటి గంటలోనే తల్లిపాలను ప్రారంభించడం చాలా ముఖ్యం అని,పాప పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు తప్పకుండా తల్లిపాలు మాత్రమే పట్టించాలి అని,6నెలల తరువాత అదనపు ఆహారం ప్రారంభించినప్పటికీ,2సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలము తల్లిపాలను కొనసాగించడం మంచిదని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు చెప్పారు.

**శిశువుకు తల్లిపాల వల్ల ప్రయోజనాలు**

తల్లి పాలవలన శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు సరైన మోతాదులు లభిస్తాయి అని,తల్లిపాల వలన రోగ నిరోధక శక్తి పెరిగి,ఇన్ఫెక్షన్లు తగ్గుతాయని,మరియు విరేచనాలు,
న్యూమోనియా,చెవి ఇన్ఫెక్షన్ల వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది అని, తల్లిపాల వలన శిశు మెదడు ఎదుగుదల,జ్ఞాపకశక్తి మరియు తెలివితేటలు పెరుగుతాయని జె.శ్రీనివాసులు చెప్పారు.

**తల్లి పాలు ఇవ్వడం వలన తల్లికి కలిగే ప్రయోజనాలు**

తల్లి పాలు శిశువుకు ఇవ్వడం వలన తల్లి ప్రసవం తర్వాత గర్భాశయం త్వరగా సాధారణ స్థితికివస్తుందిఅని,ప్రసవానంతరము రక్తస్రావము తగ్గుతుంది అని, తల్లి పాలు ఇవ్వడం వలన రొమ్ము క్యాన్సర్ మరియు అండాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని, సహజంగా కొంతకాలము గర్భధారణ మధ్య విరామం కల్పించడంలోసహాయపడుతుంది అని,తల్లి ఆరోగ్యం మెరుగుపడి కుటుంబానికి ఆర్థికంగా కూడా ప్రయోజనం కలుగుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు.(ముర్రు పాలు)ప్రాముఖ్యత ఏమనగా,తల్లి ప్రసవం తర్వాత మొదట వచ్చే పసుపు రంగు పాలనే మురుపాలు అంటారు అని,ఈ పాలలో వ్యాధి నిరోధక పదార్థాలు (యాంటీబాడీలు) అధికంగా ఉంటాయి అని,ముర్రు పాలు శిశువుకు మొదటి టీకా వంటివి అని,కాబట్టి వీటిని తప్పకుండా ఇవ్వాలని తల్లులకు జె.శ్రీనివాసులు తెలియజేశారు. తల్లులు గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయాలు ఏమనగా1).పాప పుట్టిన మొదటి గంటలో తల్లిపాలను ప్రారంభించాలి. 2).మొదటి ఆరు నెలలు నీరు,తేనె,గ్లూకోజు నీరు లేదా ఇతరహారము ఇవ్వకూడదు. 3).శిశువుకు అవసరమైనప్పుడు (పగలు, రాత్రి) తరచుగా పాలు ఇవ్వాలి. 4).తల్లి పాలు ఇవ్వడం వలన శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడు అని అలాగే తల్లి ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని,తల్లులకు బాల అమృతము గురించి దాని యొక్క ఉపయోగాల గురించి జె.శ్రీనివాసులుతెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ జయమ్మ,ఏ.ఎన్.ఎమ్.ఇస్తేరు రాణి,ఆశాలు తల్లులు పాల్గొన్నారు.

# ఒక్కరోజులో రెండు లక్షలు దాటిన మీసేవ లావాదేవీలు

**తొలిసారి రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు**

**దేశంలోనే నెంబర్ వన్ గా మీసేవ ఆన్‌లైన్ ప్లాట్ ఫార్మ్**

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**




**హైదరాబాద్,ఆగస్ట్ 1(ప్రజావినికిడి):**పభుత్వ సేవలు, లావాదేవీలను ఆ÷-లనైన్ లో ఒకే వేదిక మీద అందిస్తోన్న మీసేవ మరొక రికార్డును నమోదు చేసింది. శుక్రవారం ఒక్క రోజే 2,20,172 లావాదేవీలు నమోదు అయ్యాయి. ఇలా ఒకే రోజు రికార్డు స్థాయిలో మీసేవ కార్యకలాపాలు జరిగాయని ఐటిశాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు వెల్లడించారు. మీసేవ డిజిటల్ ఎ÷-లాట్ ఫామ్ ను మరింతగా అభివృద్ధి చేయటం, సేవలను విస్తృత పరచటం, ఆమేరకు ప్రజల వాడకాన్ని ప్రోత్సహించటంలో ప్రజాప్రభుత్వం చొరవచూపిస్తోంది. దీంతో కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. రాష్ట్ర పౌరులకు వేగంగా, పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలను అందించేందుకు మీసేవ వేదికను ప్రభుత్వం నిరంతరం బలోపేతం చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఒక్క రోజులో రికార్డు స్థాయిలో ఎలాంటి అవాంతరాలు లేని లావాదేవీల ద్వారా దేశంలోనే నెంబర్ వన్ గవర్నమెంట్ ఆ÷-లనైన్ ఎ÷-లాట్ ఫార్మ్ గా మీ సేవ నిలిచిందని మంత్రి అన్నారు.
÷-రతీ రోజు సరాసరి 70 నుంచి 80 వేల కార్యకలాపాలు మీసేవ ద్వారా నమోదవుతాయి. శుక్రవారం ఒకే రోజులో 2.20 లక్షలకు పైగా లావాదేవీలు నమోదయ్యాయి. వీటిల్లో ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఫ్యామిలీ కార్డు, రవాణాశాఖ, ఆదాయ ధృవీకరణ పత్రాల అప్లికేషన్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఘనత తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ సేవల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచిందని మంత్రి ప్రకటించారు. పనితీరును మెరుగుపరచడం, సేవల లభ్యతను విస్తరించడం, కొత్త పౌర సేవలను అందుబాటులోకి తీసుకురావడం, సాంకేతిక, మౌలిక వసతులను బలోపేతం చేయడం లాంటి చర్యల ఫలితంగానే ఈ మైలురాయి సాధ్యమైందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు సేవలను అందించడంలో విశేష కృషి చేసిన నిర్వాహకులు, సాంకేతిక బృందాలను మంత్రి అభినందించారు. మీసేవ ద్వారా ప్రస్తుతం ఫ్యామిలీ కార్డు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు, వివిధ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ యుటిలిటీ చెల్లింపులు, అలాగే పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సేవలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మీసేవ కేంద్రాల్లో డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు సులభంగా అందుబాటులో ఉన్నాయి. అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను మీసేవలో చేర్చడం, ఆధునిక సాంకేతికతను వినియోగించడం, సేవల నాణ్యత, వేగం, పారదర్శకతను మరింత మెరుగుపరచడం ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## బస్సు ఎక్కుతున్న వారినే టార్గెట్..

### ముగ్గురు జేబుదొంగలు అరెస్ట్..

**నాగోల్,(ప్రజావినికిడి):**
బస్సు ఎక్కే ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని సెల్‌ఫోన్లు అపహరిస్తున్న ముగ్గురు అలవాటు నేరస్తులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఒక ఐఫోన్,ఒక మోటరోలా సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని న్యాయస్థానంలో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం..జూలై 31న నాగోల్ చౌరస్తాలోని బస్‌స్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న నారాయణ రాజ్‌కుమార్, వెంకటాచారి బస్సు ఎక్కుతున్న సమయంలో కావడి శివ (22) వారిని మాటల్లో పెట్టి దృష్టి మరల్చగా, అతనితో పాటు ఉన్న మేకల జగపతి బాబు అలియాస్ జగపతి,బోయ అలియాస్ గారడీ మంజునాథ్ అలియాస్ మంజు వారి జేబుల్లోని రెండు సెల్‌ఫోన్లను



అపహరించి పరారయ్యారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన నాగోల్ పోలీసులు ఆగస్టు 1న నాగోల్ చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి దొంగిలించిన రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ప్రధాన నిందితుడు మేకల జగపతి బాబుపై వివిధ పోలీస్‌స్టేషన్లలో 7 సెల్‌ఫోన్ చోరీ కేసులు,బోయ అలియాస్ గారడీ మంజునాథ్‌పై 4 చోరీ కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు నాగోల్ పోలీసులు తెలిపారు. ఈ జేబు దొంగల నివాసంనందన వనం. మీర్పేట్ నివాసులు,ఆటో డ్రైవర్ గా,కూలి పని, చేస్తున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# బదిలీపై వెళ్తున్న పోలీసు సిబ్బందికి షాద్‌నగర్‌లో ఘన వీడ్కోలు

## - పదవీ విరమణ పొందిన ఎస్ఐ రాజేశ్వర్ కు ఘన సన్మానం





**షాద్‌నగర్, (ప్రజావినికిడి):** పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న పోలీసు సిబ్బందికి,పదవీ విరమణ పొందిన ఎస్ఐ లక్కాకుల రాజేశ్వర్ కు ఘన సన్మానం షాద్‌నగర్‌లో ఘనంగా వీడ్కోలు,సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ మేడం శిరీష,ఏసీపీ లక్ష్మీనారాయణ,ఇన్‌స్పెక్టర్ సీతారాం, ఎస్ఐ.శ్రీకాంత్ ఎస్ఐ సుశీల తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది సేవలు కీలకమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో సేవలందించిన పోలీసు సిబ్బందిని అభినందిస్తూ, బదిలీ అనంతరం కూడా అదే సేవాస్ఫూర్తితో పనిచేసి శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పదవీ విరమణ పొందిన ఎస్ఐ లక్కుల రాజేశ్వర్ పోలీసు శాఖలో తన సేవా కాలంలో విశిష్ట సేవలు అందించారని అధికారులు కొనియాడారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ బాధ్యతా యుతంగా విధులు నిర్వర్తించిన ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించి, పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

అనంతరం బదిలీపై వెళ్తున్న పోలీసు సిబ్బందితో పాటు ఎస్ఐ లక్కాకుల రాజేశ్వర్ ని శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సహచరులు వారికి ఘనంగా వీడ్కోలు పలుకుతూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

# శ్యామల నరసింహ వంశరాజ్ 23వ వర్ధంతి వేడుకలు



**భువనగిరి,(ప్రజావినికిడి):** శ్యామల నరసింహ వంశరాజ్ 23వ వర్ధంతి శనివారం రోజు గ్రామం చిమిరియాల మండల్ నారాయణపూర్ యాదాద్రి భువనగిరి జిల్లా ఈ కార్యక్రమం జరిగినది కామ్రేడ్ శ్యామల నరసింహ వంశరాజ్ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం మా యొక్క గ్రామపంచాయతీలో ఈ యొక్క కార్యక్రమంలో విజయవంతంగా చేసుకుంటాము నరసింహ చేసిన సేవలు భారత కమ్యూనిస్టు పార్టీ మరువలేనిదని గ్రామ కార్యదర్శి కామ్రేడ్ జంగయ్య అన్నారు భారత కమ్యూనిస్టు పార్టీ వారిని ఎప్పుడు కూడా మరువలేనిదని అన్నారు వారి కుటుంబ సభ్యులు శ్యామల యాదగిరి, శ్యామల పద్మ, దివ్య,శిరీష, శివకుమార్, సందీప్ కుమార్, సైదులుఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులకు శుభవార్త

## ఉద్యోగాల కోసం ప్రత్యేక కోచింగ్ -మచ్చేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ







**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్‌నగర్‌లోని కాకతీయ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ప్రత్యేక కోచింగ్ కార్యక్రమం ప్రారంభమైంది. పరిగి రోడ్డులోని హనుమాన్ ఆలయం పక్కన పోలీస్ కోచింగ్ నిర్వహిస్తున్నార ుపోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్నా అభ్యర్థులకు డైరెక్టర్ మచ్చేందర్ కోచింగ్ అందిస్తున్నారు. పరీక్షలలో విజయవంతం కావడానికి అవసరమైన అన్ని రకాల శిక్షణ అందిస్తున్నారు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న లక్ష్యంతో కృషి చేస్తున్న యువతకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడనుంది. అనుభవజ్ఞులైన శిక్షకుల పర్యవేక్షణలో అభ్యర్థులకు ఫిజికల్ ట్రైనింగ్‌తో పాటు ఉద్యోగ పరీక్షలకు అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నారు. ఈ సందర్భంగా మచ్చేందర్ మాట్లాడుతూ,పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న అభ్యర్థులు క్రమశిక్షణతో శిక్షణ పొందుతూ తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఉద్యోగ పరీక్షలకు అవసరమైన మార్గదర్శకత్వం కూడా అందిస్తున్నట్లు తెలిపారు. షాద్‌నగర్ అలాగే పరిసర ప్రాంతాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. యువత తమ లక్ష్యాలను సాధించే దిశగా క్రమశిక్షణతో శిక్షణలో పాల్గొని విజయాన్ని అందుకోవాలని సూచించారు.

# సాయి గార్డెన్స్ కాలనీ అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తాం..

## మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):** బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాయి గార్డెన్స్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నూతన కమిటీ ఏర్పరచుకున్న సందర్భంగా శనివారం రోజు బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ అభివృద్ధికి అలాగే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరడం జరిగింది. స్పందించిన లచ్చి రెడ్డి ఒకటొకటిగా కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ నూతన అధ్యక్షులు మదనం శ్రీనివాస్,మాజీ అధ్యక్షులు హనుమంత రావు పోట్రు,ఉపాధ్యక్షుడు వెంకట్ రమణ,ప్రధాన కార్యదర్శి కె వి అనిల్,కోశాధికారి బి.శ్రీధర్,సంయుక్త కార్యదర్శులు ఆర్ సతీష్,ఓం ప్రకాష్,కమిటీ సభ్యులు మధుసూదన్ రెడ్డి,ఎం.వేణు, శివ,బాలాజీ ధుమాల్ తదితరులు ఉన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు ఆగస్టు 10 వరకు గడువు పొడిగింపు...

## అదనపు సమయాన్ని నాణ్యత పెంపునకు -వినియోగించాలి.భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్..

## ఎస్ఐఆర్ అమలుపై రంగారెడ్డి జిల్లా అధికారులతో సమీక్ష-జిల్లా కలెక్టరేట్‌లో సమావేశం.. క్షేత్రస్థాయి పరిశీలన..








**రంగారెడ్డి,(ప్రజావినికిడి):** భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ాx=) కార్యక్రమానికి ఆగస్టు 10 వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో, లభించిన అదనపు సమయాన్ని పూర్తిగా నాణ్యత పెంపునకు వినియోగించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు.

శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం అమలుపై సమీక్షా సమావేశానికి హాజరైన భారత ఎన్నికల సంఘం కార్యదర్శికి జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణ రెడ్డి,అదనపు కలెక్టర్లు కె. కిరణ్మయి, చంద్రారెడ్డి ఘన స్వాగతం పలికారు.

సమీక్షా సమావేశంలో భారత ఎన్నికల సంఘం కార్యదర్శి మాట్లాడుతూ, ఇప్పటి వరకు జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ఓటరు అవగాహన కార్యక్రమాలు, ఫారం ఫిల్లింగ్ మేళాలు ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై విశ్వాసాన్ని పెంచాయని ప్రశంసించారు. ప్రారంభంలో రాష్ట్ర సగటుతో పోలిస్తే డిజిటైజేషన్ వేగం తక్కువగా ఉండటంతో పురోగతిని సమీక్షించేందుకు జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం అదనంగా ఏడు రోజుల గడువు కల్పించిన నేపథ్యంలో, ఇప్పటికే డిజిటైజ్ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు, ఫోటోలు,పత్రాల అప్‌లోడ్ తదితర అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా నిర్ధారించాలని సూచించారు. ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నాణ్యతను ధృవీకరించాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని,ప్రతి పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉన్న చోట వాటినే పోలింగ్ కేంద్రాలుగా వినియోగించాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రైవేట్ భవనాలను ఉపయోగించాలని స్పష్టం చేశారు. మరణించిన, చిరునామా మార్చుకున్న లేదా గుర్తించలేని ఓటర్ల వివరాలను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి కుటుంబ సభ్యులు,స్థానిక సమాచారం ఆధారంగా పూర్తిస్థాయిలో ధృవీకరించాలని సూచించారు. తద్వారా భవిష్యత్తులో వచ్చే అభ్యంతరాలు, నోటీసుల సంఖ్య తగ్గుతుందని పేర్కొన్నారు. అవసరమైతే అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులను నియమించి పనిభారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్లు గుర్తించలేకపోతున్నామని, బీఎల్‌వోలు అందుబాటులో లేరనే ఫిర్యాదులు ఎన్నికల సంఘానికి వస్తున్నాయని పేర్కొంటూ, అలాంటి సందర్భాల్లో బీఎల్‌వోలు ప్రజలకు పూర్తి సహకారం అందిస్తూ అవసరమైన దరఖాస్తులు స్వీకరించి ఎన్నికల ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. రంగారెడ్డి జిల్లాలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్న తీరు సంతృప్తికరంగా ఉందని,ఇదే ఉత్సాహంతో మిగిలిన ప్రక్రియను నాణ్యతతో పూర్తి చేసి ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 3,501 పోలింగ్ కేంద్రాలు, 36,99,743 మంది ఓటర్లు ఉన్నారని, ఒక్కో పోలింగ్ కేంద్రానికి సగటున 1,056 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు. శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, మహేశ్వరం వంటి పట్టణ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో మ్యాపింగ్ ప్రక్రియ సవాలుగా మారిందన్నారు. కొన్ని గ్రామాలు, పోలింగ్ కేంద్రాలు రెండు జిల్లాల పరిధిలో ఉండటంతో ప్రత్యేక సమన్వయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 63.53 శాతం మ్యాపింగ్ పూర్తయ్యిందని, మిగిలిన ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని, గ్రామీణ నియోజకవర్గాల్లో మంచి పురోగతి నమోదవుతుండగా,పట్టణ ప్రాంతాల్లో పెండింగ్ మ్యాపింగ్, అనామలీస్, డూప్లికేట్,నో మ్యాపింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఆగస్టు 10 వరకు గడువు పొడిగించడం జిల్లాకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ఈ అదనపు సమయాన్ని పూర్తిగా వినియోగించుకొని ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తామని తెలిపారు.

బీఎల్‌వోలు, బీఎల్ఏలతో కలిసి పెండింగ్ కేసులను సంయుక్తంగా ధృవీకరించి, అవసరమైన చోట ఓటర్లను నేరుగా సంప్రదించి వివరాలు సేకరిస్తామని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలతో ఇప్పటికే విస్తృత సమావేశాలు నిర్వహించి అపోహలను తొలగించామని, మరోసారి ఈఆర్‌వో స్థాయిలో సమావేశాలు నిర్వహించి మిగిలిన ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలకు దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను సాధ్యమైనంత వరకు అదే కమ్యూనిటీల్లో ఏర్పాటు చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని,ఓటర్లకు మరింత సౌకర్యవంతమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటే లక్ష్యమని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రారంభం నుంచి జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక శిబిరాలు, ఫారం ఫిల్లింగ్ మేళాలు నిర్వహించడం వల్ల ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారుప్రతి అర్హుడైన ఓటరు వివరాలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితంగా నమోదయ్యేలా అత్యున్నత నాణ్యతతో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. సమీక్ష అనంతరం భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్, అదనపు కలెక్టర్ కె.కిరణ్మయితో కలిసి కొంగర, బొంగులూరు, ఎల్బీనగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. బీఎల్‌వోలతో మాట్లాడి ప్రక్రియ నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలు, ప్రజల స్పందన తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కె.కిరణ్మయి, చంద్రారెడ్డి, జోనల్ కమిషనర్లు, ఈఆర్‌వోలు, జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రకు మణిహారం భోగాపురం !

**ఆగస్టు 1 (ప్రజావినికిడి):**
పోర్టులు, ఎయిర్‌పోర్టులు, సువిశాల సముద్రతీరం కలిగి ఉండడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కలసి వచ్చే అంశం. రోడ్లు గ్రామాలను అనుసంధానిస్తే, రైల్వేలు పరిశ్రమలను కలుపుతాయి. ఓడరేవులు దేశాల మధ్య వ్యాపారాన్ని విస్తరిస్తే, విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి అవకాశాలను ముంగిట్లోకి తీసుకొస్తాయి. నేటి గ్లోబల్ ఎకానమిలో అంతర్జాతీయ స్థాయి ఏవియేషన్ రవాణా వ్యవస్థ ఉంటేనే విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, పారిశ్రామిక ఎగుమతులు, రియల్ ఎస్టేట్, ఉద్యోగావకాశాలు విస్తరిస్తాయి. దీంతో అభివృద్ధి వేగంగా సాగడానికి దోహదపడుతుంది. ఎపిలో అనేక సహజ వనరులు ఉన్నప్పటికీ గతంలో నిర్లక్ష్యం చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక అనేక రంగాల్లో అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది. ఓ వైపు భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వచ్చింది. ప్రధాని మోడీ దీనిని ప్రారంభించడం ద్వారా ఉత్తరాంధ్ర కు గేట్‌వేను తెరిచారు. అమరావతలి రాజధాని నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. అలాగే పోలవరం పూర్తి కావస్తోంది. ఇవన్నీ నిజానికి జగన్ హయాంలోనే పూర్తి కావాల్సిన ప్రాజక్టులు. కానీ జగన్ నిర్లక్ష్యం కారణంగా వీటిని పక్కన పెట్టారు. మనమెంతకాలం ఉంటామన్నది పక్కన పెట్టి అభివృద్ధిలో మనదైన ముద్ర వేస్తే చిరకాలం ప్రజలు గుర్తుంచుకుంటారు. దశాబ్దాలుగా విశాఖపట్నం ఉత్తరాంధ్రకు ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్నా, ప్రస్తుతం ఉన్న విశాఖ విమానాశ్రయం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం



కాదు. ఇది నావల్ డాక్ వారి విమానాశ్రయం కావడంతో చంద్రబాబు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయా నికి నిర్ణయించారు. విశాఖ పట్టణానికి ఇది దగ్గరగా ఉండడ, ఉత్తరాంధ్రకు కూడా కలసి వచ్చే అంశం. విశ్వాఖ పూర్తిస్తాయి విమానాశ్రయం కాకపోవడంతో ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థలు విశాఖకు తగినన్ని సర్వీసులు నడపలేక పోయాయి. విశాఖపట్నం ఐటీ, ఫార్మా, వైద్యం, విద్య పర్యాటక రంగాల్లో అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా ఎదుగుతున్న వేళ, ఒక పూర్తిస్థాయి పౌర అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఏర్పడింది. అందుకే ఎపి విభజన తరవాత చంద్రబాబు భోగాపురం కోసం నిర్ణయించారు. 2014లో విశాఖ సమీపంలోని భోగాపురాన్ని గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి అనువైన ప్రాంతంగా గుర్తించారు. 2019 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కేవలం విమానాశ్రయమే కాకుండా ఏరోసిటీ, విమానాల మరమ్మతులు, పైలట్ శిక్షణ కేంద్రాలతో కూడిన లాజిస్టిక్స్ హబ్‌గా దీనిని డిజైన్ చేశారు. భూసేకరణ చేపట్టి, ఇళ్లు కోల్పోయిన 390 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు ప్రత్యేక కాలనీలు నిర్మించారు. అన్నింటికి మించి రామ్మోహన్ నాయుడును ఎన్‌డిఎలో పౌర విమానయాన శాఖ మంత్రిగా నియించయుకోవడం ద్వారా పనులు చకచకా చేయించుకోగలిగారు. చంద్రబాబు సిఎంగా కొనసాగివుంటే 2019లోనే ఇది పూర్తయ్యేది. దాదాపు 12 ఏళ్ల తరవాత మళ్లీ రెండోదఫా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక భోగాపురం వేగం పుంజుకుని చకచకా పనులు పూర్తి చేసుంది. ఇలా చరిత్రలో 2026 ఆగస్టు 1 నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడం విశేషం. సాధారణంగా విమానాశ్రయాలు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తాయి. కానీ కొన్ని ప్రాజెక్టులు మాత్రమే ఒక ప్రాంత ఆర్థిక రూపురేఖలను పూర్తిగా మార్చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సరిగ్గా అటువంటి ప్రాజెక్టే!

మౌలిక సదుపాయాల కల్పన ఏ ప్రాంత ఆర్థికాభివృద్ధికైనా పునాది వంటిది. ఈ ఆలోచనా సరళితోనే కూటమి ప్రభుత్వం భోగాపురం విమానాశ్రయాన్ని అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దింది. నిజానికి ఇది

2019లోపే పూర్తయి వుంటే పరిస్తితి మరోలా ఉండేది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ మౌలిక వసతుల విప్లవంలో భోగాపురం ప్రాజెక్టు ఒక మచ్చుతునక! జాతీయ రహదారులు, రైల్వేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానం ద్వారా దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే క్రమంలో ఇది మరో చరిత్రాత్మక విజయం. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భోగాపురం అనేది కేవలం ఒక కనెక్టివిటీ మాత్రమే కాదు. ఆత్మవిశ్వాసానికి, సరికొత్త అవకాశాలకు, ఉన్నత ఆశయాలకు సంకేతం. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్‌కు, పారిశ్రామిక ఆవిష్కరణలకు ఉత్తరాంధ్ర ఇప్పుడు చిరునామాగా నిలవనుంది. 2024లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఈ ప్రాజెక్టు మళ్లీ శరవేగంగా పట్టాలెక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించగా, కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రాత్రింబవళ్లు పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.4,700 కోట్ల భారీ వ్యయంతో 2,700 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన భోగాపురం విమానాశ్రయం దేశంలోనే అత్యంత ఆధునిక గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులలో ఒకటి. ఇక్కడ నిర్మించిన 3.8 కిలోమీటర్ల సుదీర్ఘ 'కోడ్ 4ఈ' రన్‌వే ద్వారా భారీ అంతర్జాతీయ విమానాలు కూడా సునాయాసంగా ల్యాండ్ అవుతాయి. ప్రాథమికంగా ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా ఈ టెర్మినల్ రూపుదిద్దుకుంది. ప్రకృతి విపత్తులను సైతం తట్టుకునేలా అత్యున్నత ప్రమాణాలతో దీనిని నిర్మించారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి ర ఆవడంతో ఉత్తరాంధ్రలోని ఫార్మా, సీఫుడ్, పండ్లు, పూలు, వస్త్ర పరిశ్రమల ఎగుమతులకు అవకాశాలు పెరగడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

---

## క్షమాపణలు కాదు... కేసుల ఎత్తివేతపై మాట్లాడండి

### ప్రధాని మోడీ క్షమాపణలపై అభిజిత్ దీప్కే ప్రశ్నలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 1 (ప్రజావినికిడి):**



విద్యార్థులను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రీల్‌లో మాత్రమే క్షమిస్తారా? లేక విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉపసంహరించుకుంటారా?' అంటూ ఆయన సోషల్ మీడియా ద్వారా ప్రశ్నించారు. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో, కొందరు ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ ఘటనపై ప్రధాని స్పందిస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేశారు. తనను, తన తల్లిని దూషించిన వారిని తాను క్షమిస్తున్నానని, వారిని శిక్షించడం కంటే సరైన మార్గంలో నడిపించడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. వీడియోపై స్పందించిన అభిజీత్ దిప్కే, 'క్షమించామని చెప్పడం సరిపోదు. విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఎత్తివేస్తారా?' అని ప్రశ్నించారు. అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఒక కెమెరామెన్‌పై అనుచిత పదజాలం ఉపయోగించిన వీడియోను ప్రస్తావిస్తూ, 'ఈ దేశంలో రెండు రకాల చట్టాలా? యువతకు ఒకటి, అధికార పార్టీకి మరొకటా?' అని విమర్శించారు. కాగా, ప్రధానమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆరోపణలతో నోయిడాకు చెందిన ఓ బాలికపై కేసు నమోదైంది (ఏజీనిబిజీస ఓజీనిబిజీస ÷ఔసనీబి।బబి). తాజాగా ఆమె వీడియో విడుదల చేసి దేశ ప్రజలకు, ప్రధానమంత్రికి క్షమాపణలు చెప్పింది. తాను చేసిన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేసింది. కాగా, నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువలో ఎల్లంపల్లి

### సందర్శకులను అనుమతించని అధికారులు




**కరీంనగర్,ఆగస్టు 1 (ప్రజావినికిడి):**ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో హాజీపూర్ మండలంలోని గుడిపేట సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టు అందాలను వీక్షించి ఆనందించాలనుకునే సందర్శకులకు మాత్రం నిరాశే ఎదురవుతోంది. గేట్ల ఎత్తివేత నేపథ్యంలో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వెళ్లే మార్గంలో గుడిపేట చేపల మార్కెట్ వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి ఎవరినీ అనుమతించడంలేదు. దీంతో ప్రాజెక్టు చూసేందుకు వచ్చిన సందర్శకులు అసహనంతో వెనుదిరిగిపోతున్నారు. దీంతో స్థానికులు పర్యాటకులు పోలీసులు, నీటిపారుదల శాఖల తీరుపై మండిపడుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం అనంతరం అవతలి వైపున ఉన్న పెద్దపల్లి జిల్లాకు చిన్న వాహనాల రాకపోకలకు అనుమతులు ఇవ్వడంతో ఈ మార్గం ద్వారా ప్రతి రోజు వందలాది మంది ప్రయాణిస్తున్నారు. రామగుండంలోని ఎన్టీపీసీకి విధులకు హాజరయ్యే ఉద్యోగులు కూడా ఈ మార్గాన్నే ఎక్కువగా వినిగియోస్తుంటారు. పెద్దపల్లి జల్లాలో పనిచేసే కూలీలు, ఇతర కార్మికులు సైతం నిత్యం ఈ ప్రాజెక్టు మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. పాలవ్యాపారులు కూడా ప్రతిరోజు పదుల సంఖ్యలో మంచిర్యాల జల్లా కేంద్రానికి ఈమార్గం ద్వారానే వెళ్తుంటారు. ప్రస్తుతం ప్రాజెక్టు పైకి వెళ్లేందుకు ఆంక్షలు విధించడంతో వీరంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## ఈ యేడు తిరుమలలో రెండు బ్రహ్మోత్సవాలు

### సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో వరుసగా నిర్వహణ


**తిరుమల,ఆగస్టు 1 (ప్రజావినికిడి):**
తిరుమలలో ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో పరవశింప చేయనున్నాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించ నున్నారు. సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు వాహన సేవలు ఉంటాయి. ఈ మేరకు టిటిడి భారీగా ఏర్పాట్లు చేస్తోంది. సెప్టెంబర్ 15న సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు పెద్ద శేష వాహనం ఉంటుంది. 16న ఉదయం 8 గంటలకు



చిన్న శేష వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకు హంస వాహనం ఉంటుంది. 17న ఉదయం 8 గంటలకు సింహ వాహనం, రాత్రి 7 గంటలకు ముత్యపు పందిరి వాహనం నిర్వహిస్తారు. 18న ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనం, రాత్రి 7 గంటలకు సర్వ భూపాల వాహనం, 19న ఉదయం 8 గంటలకు మోహినీ అవతారం, సాయంత్రం 6:30 నుంచి రాత్రి 11:30 గంటల వరకు గరుడ వాహనం నిర్వహిస్తారు. 20న ఉదయం 8 గంటలకు హనుమంత వాహనం, సాయంత్రం 4 గంటలకు స్వర్ణ రథం, రాత్రి 7 గంటలకు గజ వాహనం నిర్వహిస్తారు. 21న ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకు చందప్రభ వాహనం, 22న ఉదయం 7 గంటలకు రథోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం,

23న ఉదయం 6 నుంచి 9 వరకు చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల్లో సిఫారసు లేఖలను అనుమతించరు.

## మీ కళ్లే మీ ఆరోగ్యానికి అద్దం..



**ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు!**

**కళ్లలో కనిపించే చిన్న మార్పులు తీవ్ర అనారోగ్యాలకు సూచనలు కావచ్చు**

**కళ్లు పసుపు రంగులోకి మారడం కాలేయ సమస్యలకు సంకేతం**

**మసకబారిన చూపు మధుమేహం లేదా అధిక రక్తపోటుకు ముందస్తు హెచ్చరిక**

**లక్షణాలను బట్టి స్వీయ నిర్ధారణ వద్దు, వైద్యులను సంప్రదించడం ముఖ్యం**

**సరైన ఆహారం, క్రమం తప్పని కంటి పరీక్షలతో కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు**

**ఆగస్టు 1 (ప్రజావినికిడి):**
మన ఆరోగ్యం గురించి చెప్పడానికి శరీరం అనేక సంకేతాలను ఇస్తుంటుంది. వాటిలో కళ్లు చాలా ముఖ్యమైనవి. కంటి చూపుకే పరిమితం కాకుండా, మన శరీరంలో దాగి ఉన్న అనేక ఆరోగ్య సమస్యలను కళ్లు ముందుగానే పట్టిస్తాయి. కళ్లలో కనిపించే చిన్న మార్పులను కూడా తేలిగ్గా తీసుకోకూడదని, వాటిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మీ కళ్లు చెప్పే ఆరోగ్య సంకేతాలను సకాలంలో గుర్తించడం ద్వారా అనేక వ్యాధులను ప్రాథమిక దశలోనే అరికట్టవచ్చు.

**శరీరంలోని వ్యాధులకు కళ్లు ఎలా సంకేతాలిస్తాయి?**

కళ్లలో కనిపించే కొన్ని సాధారణ లక్షణాలు, అవి సూచించే ఆరోగ్య సమస్యలను ఇక్కడ జాబితా రూపంలో చూడవచ్చు:

కళ్లు ఎర్రగా మారడం: అలర్జీలు, ఇన్ఫెక్షన్లు, కళ్లు పొడిబారడం (డ్రై ఐ) లేదా అధిక ఒత్తిడికి ఇది సంకేతం కావచ్చు.

కళ్లు పసుపు రంగులోకి మారడం: ఇది కాలేయ సంబంధిత వ్యాధులకు, ముఖ్యంగా కామెర్లకు ప్రధాన సూచన.
చూపు మసకబారడం: మధుమేహం (డయాబెటిస్), అధిక రక్తపోటు (హై బీపీ), కంటిశుక్లం లేదా గ్లాకోమా వంటి తీవ్ర సమస్యలకు ఇది ముందస్తు హెచ్చరిక కావచ్చు.

కనురెప్ప లోపలి భాగం తెల్లగా ఉండటం: శరీరంలో రక్తహీనత (అనీమియా) ఉన్నప్పుడు ఇలా కనిపించవచ్చు. కళ్లు ఉబ్బినట్లు కనిపించడం: ఇది థైరాయిడ్ గ్రంథికి సంబంధించిన సమస్యలకు సంకేతం కావచ్చు.

కనురెప్పలపై పసుపు రంగు మచ్చలు: రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు అధికంగా ఉన్నవారిలో ఇవి కనిపిస్తాయి.

రాత్రిపూట చూపు తగ్గడం: విటమిన్ 'ఏ' లోపం లేదా రెటీనాకు సంబంధించిన వ్యాధులకు ఇది ఒక ముఖ్య లక్షణం.

కళ్ల ముందు చుక్కలు, మెరుపులు: రెటీనాలో సమస్యలు ఉన్నప్పుడు ఇలాంటివి కనిపిస్తాయి. ఈ లక్షణం కనిపిస్తే తక్షణం వైద్యుడిని సంప్రదించాలి.

**గమనిక: స్వీయ నిర్ధారణ వద్దు**

పైన చెప్పిన లక్షణాలు కేవలం సూచనలు మాత్రమే. వీటిని బట్టి వ్యాధిని నిర్ధారించుకోకూడదు. కళ్లలో ఏవైనా అసాధారణ మార్పులు గమనిస్తే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే నేత్ర వైద్య నిపుణులను సంప్రదించి, వారి సలహా తీసుకోవడం చాలా ముఖ్యం.

**కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి చిట్కాలు**

విటమిన్ 'ఏ' అధికంగా ఉండే క్యారెట్లు, ఆకుకూరలు, చేపలు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకోవాలి. శరీరాన్ని, కళ్లను హైడ్రేట్‌గా ఉంచడానికి రోజూ తగినన్ని నీళ్లు తాగాలి. ఎండలోకి వెళ్లినప్పుడు హానికరమైన అతినీలలోహిత (ఖఎ) కిరణాల నుంచి కళ్లను రక్షించే సన్ గ్లాసెస్ ధరించాలి. సంవత్సరానికి ఒకసారైనా తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలి.

# కొరియన్ కనకరాజు ట్రైలర్ విడుదల

వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితిక నాయక్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం మూవీ ట్రైలర్‌ను విడుదల చేసింది. థ్రిల్, హాస్యం, హారర్ అంశాలను మేళమించి మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. సత్య కీలక పాత్ర పోషిస్తున్న ఈమూవీకి తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. కొరియన్ కనకరాజు పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగించగా.. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న హైప్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. తాజా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ సినిమా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. అనంతపురానికి చెందిన ఓ సాధారణ యువకుడు, కొరియన్ మాఫియా ప్రపంచం మధ్య జరిగే ఆసక్తికర పరిణామాలే కథకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. హారర్, కామెడీ, యాక్షన్ అంశాలను దర్శకుడు మేర్లపాక గాంధీ వినోదాత్మకంగా రూపొందించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఒకవైపు అనంతపురం యువకుడిగా మాస్ బాడీ లాంగ్వేజ్‌తో అలరిస్తూనే, మరోవైపు కొరియన్ మాఫియా డాన్ పాత్రలో స్టైలిష్ లుక్, స్వాగ్‌తో ఆకట్టుకున్నారు. రెండు పాత్రలకు భిన్నమైన హావభావాలు, బాడీ లాంగ్వేజ్, మేకోవర్‌తో వరుణ్ తేజ్ చూపించిన వైవిధ్యం అభిమానులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో నటుడు సత్య చెప్పిన పంచ్ డైలాగులు నవ్వులు పూయిస్తున్నాయి. ఆయన కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ట్రైలర్‌ను చూసిన ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. హీరోయిన్ రిథికా నాయక్ తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు మంచి ఆదరణ పొందగా, ట్రైలర్‌లో ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా యాక్షన్, హారర్ సన్నివేశాల్లో థమన్ సంగీతం సినిమాకు అదనపు బలంగా కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ట్రైలర్‌లో కనిపించిన విజువల్స్, సెట్స్, సాంకేతిక నాణ్యత సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలియజేస్తున్నాయి. ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'కొరియన్ కనకరాజు' ఇప్పటికే మంచి పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. హారర్, కామెడీ, యాక్షన్, ఎమోషన్‌లతో కూడిన పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.




# జూలో రెండు జంతువులను దత్తత తీసుకున్న అన్నా కొణిదెల



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా కొణిదెల (అన్నా లెజినోవా) మరోసారి తన సేవా దృక్పథంతో ప్రశంసలు అందుకుంటున్నారు. గత కొంతకాలంగా సోషల్ మీడియాలో చురుకుగా ఉంటున్న ఆమె.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తనకున్న గౌరవాన్ని తరచూ పంచుకుంటూ అభిమానులకు మరింత చేరువవుతున్నారు. రష్యాలో జన్మించినప్పటికీ భారతీయ ఆచారాలను పాటిస్తూ పూజలు, పండుగలు, కుటుంబ వేడుకల్లో సంప్రదాయ దుస్తులతో కనిపించే అన్నా కొణిదెలకు ఇప్పటికే సోషల్ మీడియాలో మంచి ఆదరణ ఉంది. ఇప్పుడు ఆమె తీసుకున్న మరో నిర్ణయం అందరి ప్రశంసలను అందుకుంటోంది. తాజాగా అన్నా కొణిదెల హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని రెండు జంతువులను దత్తత తీసుకున్నారు. అందులో ఒకటి ఆసియా ఏనుగు, మరొకటి రాయల్ బెంగాల్ టైగర్. ఈ జంతువుల ఆహారం, వైద్య సంరక్షణతో పాటు ఇతర నిర్వహణ ఖర్చులను ఇకపై ఆమె భరిస్తారని సమాచారం. జూ పార్క్‌లో ఆయా జంతువుల వద్ద అన్నా కొణిదెల దత్తత తీసుకున్నట్లు ప్రత్యేక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఇంతకుముందు పవన్ కళ్యాణ్ కూడా విశాఖపట్నం జూలో జిరాఫీలను దత్తత తీసుకుని జంతు సంరక్షణకు తన వంతు సహకారం అందించారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో అన్నా కొణిదెల కూడా ముందుకు రావడం అభిమానులను ఆకట్టుకుంటోంది.

# పెళ్ళి చుట్టూ సాగే కథతో క్రేజీ కళ్యాణం

అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్, నరేష్ వీకే కీలక పాత్రల్లో నటిస్తున్న ఎంటర్‌టైనర్ 'క్రేజీ కళ్యాణం'. బద్రప్ప గాజుల దర్శకుడు. బూసమ్ జగన్ మోహన్‌రెడ్డి నిర్మిస్తున్నారు. శనివారం ఈ చిత్ర టీజర్ విడుదలైంది. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో పూర్తి వినోదాత్మక చిత్రంగా దీన్ని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. సురేశ్ బొబ్బిలి ఈ సినిమాకు సంగీతం అందించారు.




# లవ్, బ్రేకప్ వార్తలపై అనుపమ పరమేశ్వరన్ స్పందన


ఇప్పుడు ప్రశాంతత వైపు అడుగులు వేస్తున్నానని వెల్లడి

ప్రముఖ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తమిళ్ యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్‌తో తన లవ్ లైఫ్, బ్రేకప్ వార్తలపై వస్తున్న ఊహాగానాలపై ఎట్టకేలకు స్పందించింది. నెట్టింట వైరల్ అవుతున్న రూమర్లకు స్వస్తి పలుకుతూ ఆమె చేసిన ఎమోషనల్ కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గత ఏడాది కాలంగా తన జీవితంలో అనేక ఒడిదుడుకులు, మానసిక సంఘర్షణలు ఎదుర్కొన్నానని అనుపమ ఆవేదన వ్యక్తం చేసింది. ఆ సమయంలో అత్యంత కష్టమైన పరిస్థితులను దాటుకుని ముందుకు రావాల్సి వచ్చిందని తెలిపింది.

“గత ఏడాది నా జీవితంలో అత్యంత సంక్లిష్టమైన, కష్టతరమైన ఘట్టం నడిచింది. ఆ కష్టాలను దాటుకుని, ఇప్పుడు మళ్లీ నా జీవితంలో సంతోషం, ప్రశాంతత వైపు అడుగులు వేస్తున్నాను“ అని అనుపమ పేర్కొంది. పరిస్థితులు ఎలా ఉన్నా మనల్ని మనం ప్రేమించుకోవడం, స్వీయ స్వేచ్ఛను ఎంచుకోవడం ఎంతో ముఖ్యమని చెబుతూ... అభిమానులు, శ్రేయోభిలాషులు అందించిన మద్దతుకు ధన్యవాదాలు తెలిపింది.



# కార్తీ 'సర్దార్ 2' టీజర్.. యాక్షన్ డోస్ నెక్స్ట్ లెవెల్!




కోలీవుడ్ హీరో కార్తీ కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' (2022) చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'సర్దార్ 2' టీజర్ విడుదలైంది. యాక్షన్ ప్రియులను ఉర్రూతలూగించేలా ఉన్న ఈ టీజర్‌తో పాటు, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపారు.

టీజర్‌ను బట్టి చూస్తే, ఈసారి అంతర్జాతీయ కుట్రలను ఛేదించే సీక్రెట్ ఏజెంట్‌గా కార్తీ మరింత పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. మొదటి భాగంలో లాగే ఇందులో కూడా తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. హాలీవుడ్ చిత్రాలను తలపించేలా హై-స్పీడ్ ఛేజ్ సీక్వెన్సులు, భారీ యాక్షన్ బ్లాక్స్‌తో టీజర్‌ను తీర్చిదిద్దారు. దీంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.'సర్దార్' మొదటి భాగానికి దర్శకత్వం వహించిన పీఎస్ మిత్రన్ ఈ సీక్వెల్‌ను కూడా తెరకెక్కిస్తున్నారు. కార్తీ సరసన మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, విలక్షణ నటుడు ఎస్‌జే సూర్య ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఆషికా రంగనాథ్, రాశీ ఖన్నా, రాజీషా విజయన్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదటి భాగానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన శామ్ సీఎస్ ఈ చిత్రానికి కూడా సంగీతం అందిస్తున్నారు.ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో ఏకకాలంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టీజర్ విడుదల తర్వాత 'సర్దార్' మొదటి భాగాన్ని మించి ఈ సీక్వెల్ బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ఎన్టీఆర్ 'డ్రాగన్' సినిమా శ్రీలంక షెడ్యూల్ రద్దు!

యాక్షన్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ - మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'డ్రాగన్' చిత్రం షూటింగ్ కు బ్రేక్ పడింది. ఇటీవల హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తుండగా ఎన్టీఆర్ భుజానికి తీవ్ర గాయమవడంతో సినీ వర్గాల్లో, అభిమానుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. అయితే, వైద్యుల సూచన మేరకు తారక్ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారని, కంగారు పడాల్సిన పనిలేదని ఆయన టీమ్ భరోసా ఇచ్చింది.వైద్యులు ఎన్టీఆర్‌ను సుమారు 6 నుంచి 8 వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోమని స్పష్టం చేయడంతో, 'డ్రాగన్' చిత్రీకరణను మేకర్స్ తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలుస్తోంది. ఈ గాయం కారణంగా చిత్ర యూనిట్ ప్లాన్ చేసిన భారీ శ్రీలంక షెడ్యూల్‌ను పూర్తిగా రద్దు చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఎన్టీఆర్ కోలుకుని మళ్లీ పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే.. అంటే సెప్టెంబర్ చివరి వారంలో లేదా అక్టోబర్ ప్రారంభంలో ఈ కొత్త షెడ్యూల్‌ను తిరిగి పట్టాలెక్కించే అవకాశాలున్నాయి.ప్లానింగ్ ప్రకారం ఈ చిత్రాన్ని 2027 జూన్ 11 ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్మాతలు పనిచేస్తున్నారు. షూటింగ్‌కు తాత్కాలిక బ్రేక్ పడినా పోస్ట్ ప్రొడక్షన్, డెడ్‌లైన్లలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు.

ప్రమాద ఘటన తర్వాత సామాజిక మాధ్యమాల్లో #GetWellSoonNTR హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. తమ అభిమాన నటుడు త్వరగా కోలుకుని, మరింత శక్తివంతంగా కెమెరా ముందుకు రావాలని అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613